క్లుప్తంగా

గిరిజన ఉపాధ్యాయ సంఘం కమిటీ ఎన్నిక

మిడ్జిల్: మండల గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీని గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కృష్ణ నాయక్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా కోట్యానాయక్, కార్యదర్శులుగా అంజిలమ్మ, శంకర్, హరిప్రియా, కోశాధికారిగా తారాసింగ్, కమిటీసభ్యులుగా శోభ, లలితను ఎంపిక చేశారు. రాష్ట్ర నాయకుడు నార్యనాయక్, జిల్లా అధ్యక్షుడు ధరాసింగ్ హాజరయ్యారు.

సేవలోనే సంతృప్తి

స్టేషన్ మహబూబ్‌నగర్: నిరుపేదలకు సేవలు చేయడంలోనే సంతృప్తి లభిస్తోందని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. అంతర్జాతీయ వాలంటరీడే సందర్భంగా గురువారం ఆయన పట్టణంలో రోడ్లపై జీవిస్తున్న పేదలకు దుప్పట్లు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో 28 ఏళ్ల నుంచి వివిధ ప్రజాసేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం, చిత్రలేఖన, క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, మహెబూబ్‌అలీ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నాగమద్దిలేటి, ప్రధాన కార్యదర్శిగా చిన్నయ్య, ఉపాధ్యక్షులుగా బాలచంద్రుడు, సువర్ణ, కోశాధికారిగా రామచంద్రయ్య, కార్యదర్శులుగా తిరుపతయ్య, జనార్ధన్‌గౌడ్, ఆంజనేయులు, వెంకటయ్యగౌడ్, నాగలక్ష్మీ, సౌజన్య, లత, అడ్డాకుల, కందూర్ కాంప్లెక్స్ అధ్యక్షులుగా శంకర్, రాజు, కార్యవర్గ సభ్యులుగా శోభారాణి, కృష్ణవేణి, రజిత, భాస్కర్‌ను ఎంపికచేసినట్లు వెంకటేష్ తెలిపారు.

కుల్కచెర్ల మార్కెట్ డైరెక్టర్లుగా చిన్నయ్య, హాజీ

గండేడ్/మహమ్మదాబాద్: గండేడ్ మండలం వెన్నాచేడ్ గ్రామానికి చెందిన చిన్నయ్య, మహమ్మదాబాద్ మండలం షేక్‌పల్లికి చెందిన హాజీ కుల్కచెర్ల మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమను డైరెక్టర్లుగా ఎన్నుకున్నందుకు చిన్నయ్య, హాజీ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మహబూబ్ సుబానీ ఉర్సు

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి గ్రామంలో రెండు రోజుల పాటు మహబూబ్‌సుబానీ ఉర్సును ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి స్వామివారికి పూలు, గంధం సమర్పించగా గురువారం ఉదయం ఫాతేహాలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు స్వీట్లు పంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు పాష, బషీర్, గ్రామస్తులు శంకర్, సుదర్శన్, సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సింహులు, పి రాఘవరెడ్డి, వేముల రాజ రెడ్డి, కుర్వ శ్రీనివాసులు, కుర్వ అంజన్న, సీతన్న పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా బీకేఎస్ బలోపేతం

నవాబుపేట: పార్టీలకు అతీతంగా బీకేఎస్‌ను బలోపేతం చేస్తామని ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి గజేంద్రుడు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సమస్యల సాధనే లక్ష్యంగా బీకేఎస్ కృషి చేస్తోందని ఆయన వివరించారు. జిల్లా నాయకులు రాంరెడ్డి, బీకేఎస్ మండల కార్యదర్శి నరేందర్‌రెడ్డి, బీకేఎస్ నాయకులు రాంమోహన్‌రెడ్డి, నర్సింహులు, రఘురాంరెడ్డి, జెట్టి రాములు ఉన్నారు.

పేస్కేల్ వర్తింపజేయాలి

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి శాఖలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ వర్తింపజేయాలని ఉపాధి హామీ పథకం యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటనాయక్ డిమాండ్‌చేశారు. గురువారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శాంతయ్య, భగవంతు, బాబురావు, వెంకటేష్, మొగులయ్య, పెంటయ్య, బి.రాజు పాల్గొన్నారు.

10నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో ఈనెల 10, 11, 12వ తేదీల్లో సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లతో పాటు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామని అన్నారు. సీఎం కప్ పోటీలను విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.





బస్సుల కోసం పడిగాపులు

- ప్రయాణికులకు తప్పని పాట్లు

బస్సుల కోసం నిత్యం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.. ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండటం.. అందుకు తగ్గట్టు బస్సుల్లేవు.. నిత్యం బస్సుల కోసం విద్యార్థులు, ప్రయాణికులు గంటల సేపు బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్నారు. వచ్చే అరకొర బస్సులు సైతం కిక్కిరిసి వస్తున్నాయి. దీంతో వాటిలో ఎక్కేందుకు నానా అవస్థలు తప్పడం లేదు. బస్సుల కోసం వందలాది మంది మహబూబ్‌నగర్ బస్టాండ్ పడిగాపులు, బస్సులు ఎక్కేందుకు పడుతున్న పాట్లు తదితర దృశ్యాలను గురువారం 'సాక్షి' క్లిక్‌మనిపించింది. - సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



నేలల పరిరక్షణకు పాటుపడాలి

- రైతులకు అవగాహన కార్యక్రమాలు
- మొక్కలు నాటిన అధ్యాపకురాలు

జడ్చర్ల: నేలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని మండల వ్యవసాయాధికారి గోపీనాథ్ తెలిపారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్ద ఆదిరాల, పోలేపల్లి, జడ్చర్ల, ఆలూరు, మల్లెబోయిన్‌పల్లి, కొండేడు, కోడ్గల్, గంగాపూర్, నసరుల్లాబాద్ గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నేల సంరక్షణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించడానికి సంబంధించిన ప్రతిజ్ఞను చేయించారు. భూసార పరీక్షలకు సంబంధించి మట్టి నమూనాలను ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. పలువురు రైతులు, ఏఈఓలు పాల్గొన్నారు.

రైతులు తెలుసుకోవాలి

కోయిల్‌కొండ: భూసార పరీక్షలు చేసుకోవడంతో వచ్చే ప్రాధాన్యతను రైతులు తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారి యామారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో భూసార పరీక్షల ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు. పంట కోత తరువాత కొయ్యలను కాల్చకుండా భూమిలో కలియదన్నాలని, దీంతో మేలుచేసే సూక్ష్మజీవులను రక్షించుకోవచ్చన్నారు



ఎన్టీఆర్ మహిళా కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధ్యాపకురాలు

మట్టినమూనాలను ఏవిధంగా..

అడ్డాకుల: మూసాపేట మండలంలోని పోల్కంపల్లి రైతువేదికలో ప్రపంచ మృత్తిక(నేల) దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. భూసారం, నేలల పరిరక్షణ, భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలనే దానిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఎంఏఓ అనిల్‌కుమార్, భూసార పరీక్ష కేంద్రం జడ్చర్ల ల్యాబ్ ఏఓ ప్రత్యూష, ఏఈఓ షరీఫ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మృత్తిక(నేల) దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నేల ప్రాధాన్యతను తెలుసుకోవాలని అన్నారు. వాటిని కాపాడుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు పద్మ, అనురాధ, శ్రీదేవి, సుధీర్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



పెద్ద ఆదిరాలలో మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ గోపీనాథ్ తదితరులు



కోయిల్‌కొండ: రైతువేదికలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి



అడ్డాకుల: పోల్కంపల్లిలో మట్టి నమూనాల సేకరణపై అవగాహన

దేవాలయం అభివృద్ధికి కృషిచేయాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీలక్ష్మినరసింహస్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక సింహగిరిలోని శ్రీలక్ష్మినరసింహస్వామి దేవాలయ సుందరీకరణ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈఆలయానికి ఎంతో ప్రాముఖ్యత, విశిష్టత ఉందన్నారు. అన్ని రకాల పండుగలను ఘనంగా జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్, గ్రంథాలయ చైర్మన్లు ఆనంద్‌గౌడ్, నర్సింహారెడ్డి, ఈఓ రంగాచారి, మార్కెట్ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సుందరీకరణ కమిటీ సభ్యులు పోల శ్రీనివాస్, తిరుపతినాయక్, సంజీవగౌడ్, కొత్త చంద్రశేఖర్, నర్సింలు, యచ్చం భాస్కర్, రామకృష్ణయ్యతోపాటు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు అందిస్తా

శివశక్తినగర్‌లోని శివాలయం అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆ ఆలయ నూతన పాలకవర్గ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీనాద్రి పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ఈ దేవాలయాన్ని కాపాడుకుందామని అన్నారు. ఎలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమం చేపట్టినా అందరూ కలిసి ఉత్సవంగా నిర్వహించుకోవాలని సూచించారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రీ, భరత్‌కుమార్, రాము, వెంకటయ్య, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన విధంగా ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు, ఏడాదికి రూ.12వేల ఆర్థికసాయం అందించాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఆటోయూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.రాములుయాదవ్, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబుమియా, హాష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత

భూత్పూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పితో బాధపడుతుండగా వారిని ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌నాయక్ జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన సమాచారం అందుకున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఏఎంఓ శ్రీనివాస్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో 32మంది విద్యార్థులు ఉన్నారు. వీరు అమిస్తాపూర్ ప్రాథమికోన్నత, భూత్పూర్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. బుధవారం రాత్రి హాస్టల్‌లో ఆయిల్ రైస్‌తో చేసిన భోజనం తిన్నారు. గురువారం పాఠశాలకు వెళ్లగా కడుపునొప్పి రావడంతో ఉపాధ్యాయుడు చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.ఈ విషయమై ఎస్సీ హాస్టల్ నిర్వాహకుడు బాల్‌రాజ్‌ను సంప్రదించగా ఇద్దరు విద్యార్థినులు తరుచూ కడుపునొప్పితో బాధపడుతున్నారని తెలిపారు. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



జడ్చర్ల: విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద ఉద్యోగులు ఉద్యోగ భద్రతకు సంబంధించి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఎంఈఓ మంజులాదేవికి సమ్మె నోటీసును అందజేశారు. ఉద్యోగ భద్రత, తదితర సమస్యల పరిష్కారం ఆందోళనబాట పడుతున్నట్లు ఒప్పంద ఉద్యోగులు తెలిపారు. శ్రీనివాసులు, రామస్వామి, విజయలక్ష్మి, సునీత ఉన్నారు.

పశువులను కాపాడుకోవాలి

కోయిల్‌కొండ: గ్రామాల్లో పశువులకు వ్యాపిస్తున్న వ్యాధుల బారి నుంచి రైతులు కాపాడుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని తిర్మలంపల్లిలో 36పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. 43దూడలకు నట్టలనివారణ మందు తాపించారు.

కంప్యూటర్ అందజేత

చిన్నచింతకుంట: మండలంలోని జూనియర్ కళాశాలకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కంప్యూటర్, ప్రింటర్‌ను గురువారం ప్రిన్సిపాల్ ప్రసన్నరాణికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, మహిమూద్, ఎస్ వెంకటేష్, గంజి బాల్‌రాజు, గూడూర్ శేఖర్, ప్రతాప్, శేఖర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సదస్సుకు నటరాజ్ ఎంపిక

పాలమూరు: ఒరిస్సాలో ఈనెల 7, 8తేదీల్లో స్వచ్ఛంద రక్తదానంపై నిర్వహించే జాతీయస్థాయి సదస్సుకు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ అంబటి నటరాజ్ ఎంపిక అయ్యారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు 15రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, ఇండోనేషియా, శ్రీలంక వంటి దేశాల నుంచి ప్రతినిధులు హాజరు అవుతారు. తెలుగు రాష్ట్రాల నుంచి నటరాజ్ ఎంపిక అయ్యారు.

తహసీల్దార్‌కు ప్రశంసాపత్రం

దేవరకద్ర: స్థానిక తహసీల్దార్ కృష్ణయ్య గురువారం కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ప్రశంసా పత్రం అందజేశారు. కృష్ణయ్య చేసిన సేవలకు తగిన గుర్తింపు వచ్చిందని మండల అధికారులు ప్రశంసించారు.

కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుచ్చర్‌కల్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.10లక్షలతో పాఠశాల ప్రహరీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం నలభై రోజుల్లో పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్ మోటె సత్యంను అభినందించారు. ఈ పాఠశాల గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డ్రెయినేజీ పనులకు రూ.3లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు షూలను అందజేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రవీణ, కాంట్రాక్టర్ మోటెసత్యం, ఏఎంసీ డైరెక్టర్ నాగిరెడ్డి, నాయకులు చంద్రకాంత్‌గౌడ్, వెంకట్‌రాంరెడ్డి, కుమ్మరి వెంకటయ్య, మల్లేష్, కరుణాకర్, కృష్ణయ్యగౌడ్, శివకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

జడ్చర్ల: పట్టణ మహిళా సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో గురువారం రూ.1.50కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పంపిణీ చేశారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో 20 మహిళా పొదుపు సంఘాలకు రుణాల చెక్కులను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డిపాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, తదితరులు

నవాబుపేట: రైతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వారిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పోమాల్‌కి చెందిన లింగం పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఎడ్లబండపై తరలివచ్చారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో పాటు మార్కెట్ చైర్మన్ లింగం, వైస్ చైర్మన్ తులసీరాంనాయక్‌ను అభిమానులు గజమాలతో సన్మానించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



మూసాపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: అర్హులందరికీ త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మూసాపేట, అడ్డాకుల రైతువేదికల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మూసాపేటలో శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్రాన్ని పరిశీలించారు. దేవాలయం వద్ద హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి నుంచి కాటవరం గ్రామానికి కల్వకుర్తి నీళ్లు వచ్చే కాలువ నిర్మాణానికి భూమిపూజ చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీకాంత్‌రెడ్డిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. పార్టీ అధ్యక్షుడు శెట్టిశేఖర్, తోట శ్రీహరి, నాగిరెడ్డి, జగదీశ్వర్, బాలనర్సిములు, విజయమోహన్‌రెడ్డి, బగ్గి కృష్ణయ్య, నాగార్జున్‌రెడ్డి, గోవర్ధన్, దశరథ్‌రెడ్డి, సత్యం, రాంచందర్ ఉన్నారు.

చిన్నచింతకుంట: బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీఎఫ్‌టీయూ బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దమగ్నాపూరంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు ప్రేమయ్య, డేవిడ్‌లతో పాటు పలువురు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జడ్చర్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో గల నాగసాల గ్రామ శివారులోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గతంలో ఇదే పాఠశాలలో అల్పాహారం తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రికి వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. తాజా కూరగాయలు, నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగించాలని కోరారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్యం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ పారిజాత, వార్డు కౌన్సిలర్లు నవనీత, ప్రశాంత్‌రెడ్డి, రఘురాంగౌడ్, నాయకులు మురళీ, పరమటయ్య పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, తదితరులు

పీఈటీలు అంకితభావంతో పనిచేయాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: అంకుటిత దీక్షతో ఉద్యోగం పొందిన పీఈటీలు ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని తెలంగాణ పీడీ, పీఈటీ అసోసియేషన్ జిల్లా కమిటీ నాయకులు పేర్కొన్నారు. 2024 డీఎస్సీలో పీఈటీలుగా ఎంపికైన వారిని గురువారం మెయిన్ స్టేడియంలో ఆయా కమిటీల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.విద్యార్థులను క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దాలని కోరారు. టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విలియం, ప్రధానకార్యదర్శి కృష్ణ, పీడీలు ఆ నందకుమార్, వడెన్న, నిరంజన్‌రావు, రాములు, మొగులాల్, నూతన పీఈటీలు మహేష్ చంద్ర, రవికాంత్, వెంకటేశ్, రాకేశ్‌కుమార్, శ్రీనివాస్‌నాయక్, శివప్రసాద్ పాల్గొన్నారు.



నూతన పీఈటీలను సన్మానించిన దూమర్ల నిరంజన్, డీవైఎస్ఓ శ్రీనివాస్, తదితరులు

నేటి నుంచి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

భూత్పూర్: మండల కేంద్రంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతనంగా పోచమ్మ, కట్టమ్మ, కోట మైసమ్మ , గండదీప, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆయన వివరించారు. యానగుంది గురూజీ మల్లికార్జున స్వామి హిరేమర్ నేతృత్వంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. శివాలయ వేద పండితుడు శివ శ్రీమంజునాథస్వామి, హన్వాడ శివశ్రీ పరమేశ్వర స్వామి, కర్నకోట శ్రీ రాజశేఖర్‌స్వామి వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపడుతారన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల గ్రామ శివారులో గల శ్రీస్వామి నారాయణ అంతర్జాతీయ గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు కొనసాగిన క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో,వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్ పోటీలతో పాటు అథ్లెటిక్స్‌కు సంబంధించి రన్నింగ్, స్కేటింగ్, కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో 58 బంగారు పతకాలతో సామవేద గ్రూప్ ప్రథమస్థానంలో నిలిచింది. 45 బంగారు పతకాలతో రుగ్వేదగ్రూప్ ద్వితీయ స్థానం సాధించింది. 25 బంగారు పతకాలతో ఆదర్వణవేద గ్రూప్ తృతీయ స్థానం దక్కించుకుంది. విజేతలకు ఎంఈఓ మంజులాదేవి, గురుకుల స్వాములు సర్వదర్శన్ దాస్, నయన్ ప్రియన్ దాస్, దర్శన్ ప్రియదాస్, ప్రిన్స్‌పాల్ రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. గురువారం దేవాలయం ప్రాంగణంలో అయ్యప్ప పడి పూజను ఘనంగా నిర్వహించారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన పద్దెనిమిది మెట్ల వేదికపై అయ్యప్ప స్వామి కొలువుదీరారు. వినాయకుడు, సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు, మహిళలతో దేవాలయం ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి పాటలు పాడుతూ మాల ధారులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అయ్యప్పస్వామి శోభాయాత్రను గురువారం తెల్లవారుజామున 5గంటలకు నిర్వహించారు. ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాతబస్టాండ్, రాయిచూర్ రోడ్ మీదుగా జరిగిన శోభాయాత్ర కొనసాగింది.

వెండి గిన్నె వితరణ

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయానికి గురువారం భక్తులు వెండి తీర్థం గిన్నెను అందజేశారు. దేవరకద్రకు చెందిన రాంగోపాల్ దంపతుల మనురాలు యూస్‌ఎస్‌లో ఉండే అఖిల మనివాస్ దేవాలయంలో పూజలు నిర్వహించి వెండి గిన్నెను పూజారి నాగభూషణం స్వామికి అందజేశారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

అడ్డాకుల: జాతీయ రహదారిపై మంగళవారం ట్రాక్టర్‌ను ఢీకొట్టి వెళ్లిపోయిన డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు.. పెద్దమందడి మండలం గట్లఖానాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి అడ్డాకుల శివారులోని స్నేహ పరిశ్రమ వద్ద ఓ వాహనం ఢీకొట్టింది. హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న డీసీఎం ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఆగకుండా వెళ్లిపోగా సీసీ కెమెరాల ఆధారంగా వాహనాన్ని గుర్తించి డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.